
సాక్షి
రంగారెడ్డి

మంగళవారం । 14 । జనవరి । 2025



సంక్రాంతి వెనుక సైన్స్

సంక్రాంతి పండుగను తెలుగు ప్రజలు విశిష్టంగా జరుపుకొంటారు. పండుగ వెనుక ఆరోగ్య సూత్రాలు ఎన్నో ఉన్నాయి. 8లో▸



సికింద్రాబాద్‌లో షెల్టర్!

కేరళలోని జ్యువెలరీ దుకాణంలో బంగారు ఆభరణాలు చోరీ చేసి పరారీలో ఉన్న రామ కృష్ణన్ సికింద్రాబాద్‌లో చిక్కాడు. 8లో▸



డప్పుతో రావాలి

మందకృష్ణ మాదిగ చేపట్టిన పోరాటానికి డప్పులతో రావాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు అశోక్ పిలుపునిచ్చారు. 8లో▸

న్యూస్‌రీల్

వైభవంగా గోదా కల్యాణం



మొయినాబాద్: మంగళవాయిద్యాలు.. వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య చిలుకూరు బాలాజీ దేవాలయంలో సోమవారం గోదా కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. తెల్ల వారుజామున 4 గంటలకే స్వామివారికి ధను ర్మాస ఆరాధన చేపట్టారు. అనంతరం ఆలయం వెనకభాగంలో ఉన్న అద్దాల మహ ల్‌లో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వ రస్వామి ఉత్సవ మూర్తులను మండపంలో ఆసీనులను చేశారు. వేద పండితుడు పరావస్తు రంగాచార్యులు చేతులమీదుగా గోదా కల్యా ణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ఆలయ అర్చకుడు రంగరాజన్ గోదా కల్యాణం విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమం లో ఆలయ మేనేజింగ్ కమిటీ కన్వీనర్ గోపాల కృష్ణస్వామి, అర్చకులు, నరసింహన్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ జ్యూరీకి ఎంపిక



ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి పుస్తకాలు అందజేస్తున్న లచ్చిరామ్

తుర్కయంజాల్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం మున్సిపాలిటీ పరిధిలోని మున గనూర్‌కు చెందిన ఉదావత్ లచ్చిరామ్ దరఖాస్తు చేసుకున్నారు. తెలంగాణ నుంచి ఆరుగురు ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. లచ్చిరామ్ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ జ్యూరీకి ఎంపికయ్యారు. దీంతో కేంద్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియాలో శాశ్వత సభ్యత్వం కలి గించడంతో పాటు, రూ.10వేల విలువైన పుస్త కాలను ఉచితంగా అందజేసింది. ఈ మేరకు సోమవారం లచ్చిరామ్ ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, రాష్ట్ర రోడ్ డెవ లప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసి పలు పుస్తకాలను వారికి బహూకరించారు. లచ్చి రామ్ జ్యూరీకి ఎంపిక కావడంపై వారు అభి నందనలు తెలిపారు.

చలికి గజగజ

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ మహానగరం తో పాటు శివారు ప్రాంతాలను చలి వణికిస్తోం ది. పగటి ఉష్ణోగ్రత సాధారం కంటే తక్కువగా నమోదవుతుండగా, కనిష్ఠ ఉష్ణోగ్రత 15 డిగ్రీ లకు దిగువన ఉష్ణోగ్రతలు పడిపోయాయి. చలికి తోడు పొగమంచు కూడా దట్టంగా వ్యాపిస్తోంది. దీంతో ఉదయం వేళల్లో ప్రయా ణాలు సాగించే వారికి రోడ్డు కనిపించక తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం నగ రంలో గరిష్ట ఉష్ణోగ్రత 27.2 డిగ్రీలు నమోదైం ది. ఇది సాధారణం కంటే 2.3 డిగ్రీలు తక్కువ. రాబోయే మూడు రోజులు రాత్రి పూట ఉష్ణో గ్రత మరింత తగ్గుముఖం పడే అవకాశం ఉం దని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడిం చింది. చలి కారణంగా వృద్ధులు, చిన్నారులు, రాత్రి వేళ ఉద్యోగాలు, పనులు చేసేవారు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

చైనీస్ మాంజా విక్రయాలకు చెక్

చాంద్రాయణగుట్ట: ప్రమాదాలకు కారణమవు తున్న నిషేధిత చైనీస్ మాంజా విక్రయాలు జరగకుండా ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకు న్నామని నగర టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు తెలిపారు. పురానీహవే లీలోని తన కార్యాలయంలో సోమవారం విలే కర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ తేడాది లంగర్ హౌజ్‌లో చైనీస్ మాంజాతో ఆర్మీ జవాన్ మృతి చెందడం, ఎన్నో పక్షులు కూడా ప్రమాదాలకు గురవడాన్ని దృష్టిలో పెట్టుకుని అక్టోబర్ 1వ తేదీ నుంచి పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ ఆదేశానుసారం టాస్క్ ఫోర్స్ డీసీపీ వైవీఎస్ సుధీంద్ర పర్యవేక్షణలో నగర వ్యాప్తంగా ఏడు ప్రత్యేక టీమ్‌లతో మాం జా విక్రయాలపై దృష్టి సారించామన్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు 107 కేసులు నమోదు చేసి 148 మంది వ్యాపారులను పట్టుకున్నామ న్నారు. వారి వద్ద నుంచి దాదాపు రూ.90 లక్షల విలువైన 7,335 మాంజా చెరక్ (ఉండ) లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇందులో సౌత్ జోన్‌లో 15 కేసులు, సౌత్ ఈస్ట్ జోన్-17, ఈస్ట్ జోన్-19, సౌత్ వెస్ట్ జోన్-32, ఈస్ట్ జోన్-19, నార్త్ జోన్-14, సెంట్రల్ జోన్-04, వెస్ట్ జోన్-06 కేసుల చొప్పున నమోదయ్యా యన్నారు. పర్యావరణానికి కూడా హాని చేకూర్చే ఈ మాంజాను ఎవ్వరూ వాడకూడ దని హెచ్చరించారు. ఎవరైనా దాచి పెట్టి విక్ర యాలు చేపడుతున్నట్లు సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. ఈ సమా వేశంలో ఇన్‌స్పెక్టర్లు ఎస్.రాఘవేంద్ర, సైద బాబు తదితరులు పాల్గొన్నారు.

పండుగ వచ్చె.. పల్లె మురిసె



ఆమనగల్లు: రంగుల విక్రయాలు



మొయినాబాద్: గాలిపటాలు కొనుగోలు చేస్తున్న యువకులు, పిల్లలు



ఇబ్రహీంపట్నం: సీతారాంపేటలో భోగి మంటలు

సంక్రాంతి సంబరాలను జిల్లావాసులు ఘనంగా జరుపుకొంటు న్నారు.. పల్లెల్లో ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. సోమవారం భోగి వేడుకలను నిర్వహించారు. ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లులు వేసి గొబ్బెమ్మలతో తీర్చిదిద్దారు. చిన్నారులపై భోగిపండ్లు పోసి ఆశీర్వదించారు. చిన్నాపెద్దా తేడా లేకుండా గాలిపటాలు ఎగురవేసి కేరింతలు కొట్టారు. పిండివంటలు ఆరగించారు. ఆయా గ్రామాల్లో ముగ్గుల పోటీలు, పలు క్రీడా పోటీలు నిర్వహించారు.



మొయినాబాద్‌రూరల్: బాకారంలో ఇంటి ముందు ముగ్గులు వేస్తున్న మహిళలు

పండగపూట చీకట్లే!



గ్రేటర్‌లో వెలగని వీధిదీపాలు

- జీహెచ్‌ఎంసీ–ఈఈఎస్‌ఎల్ మధ్య ‘స్ట్రీట్’ ఫైట్
- పరస్పర ఆరోపణలతో పనులకు ఆటంకం
- చీకట్లు తొలగేదెన్నడని ప్రశ్నిస్తున్న ప్రజలు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో పలు ప్రాం తాల్లో ఎంతోకాలంగా వీధిదీపాలు (స్ట్రీట్ లైట్స్) వెలగడం లేదు. అదుగో పనులు చేస్తున్నాం.. ఇ దుగో కొత్త వెలుగులొస్తున్నాయని అధికారుల హామీలు తప్ప ఆచరణలో కనిపించడం లేదు. నగరంలో వీధిదీపాల సమస్యలు పరిష్కరిస్తున్నా మని, కొత్త సంవత్సరానికల్లా కొత్త వెలుగులతో నగరంలో చీకట్లు తొలగిపోతాయని అధికారులు పేర్కొన్నప్పటికీ చీకట్ల పరిస్థితులు మారలేదు. కొత్త సంవత్సరమే కాదు..ఏకంగా సంక్రాంతి పం డుగ వచ్చినా, నగరంలో వీధిదీపాల కాంతులు మాత్రం రాలేదు.

ఏమిటీ స్ట్రీట్ ఫై(లై)ట్ ?

జీహెచ్‌ఎంసీ పరిధిలో స్ట్రీట్‌లైట్స్ నిర్వహణ పనులు చేస్తున్న ఈఈఎస్‌ఎల్(ఎనర్జీ ఎఫిషి యెన్సీ సర్వీసెస్ లిమిటెడ్)కు జీహెచ్‌ఎంసీకి మధ్య నెలకొన్న వివాదం ప్రజలకు శాపంగా మారింది. తమకు సక్రమంగా జీహెచ్‌ఎంసీ చెల్లింపులు చేయనందున పనులు చేయడం లేదని ఈఈఎస్‌ఎల్ అంటోంది. ఈఈఎస్‌ఎల్ ఒప్పందానికనుగుణంగా పనులు సవ్యంగా చేయకపోయినా ఎంతోకాలం చెల్లింపులు చేశామ ని, సక్రమంగా పనులు చేయనందునే చెల్లింపులు తాత్కాలికంగా నిలిపినట్లు జీహెచ్‌ఎంసీ వర్గాల సమాచారం. రెండింటి మధ్య దాదాపు రూ.70 కోట్లకు సంబంధించిన వివాదం ముదిరింది. నిర్వహణ పనులు చేయాల్సిన ఈఈఎస్‌ఎల్ పనులు చేయడం లేదు. ఈఈఎస్‌ఎల్ థర్డ్ పార్టీగా నియమించుకున్న ఏజెన్సీలకు చెల్లిం పులు చేయడం లేదు. ఏజెన్సీలు తమకు వేతనా లివ్వనందున తాము పనులు చేయలేమని కార్మి కులు గత మూడునెలలుగా పనుల నిరాకరణ చేస్తున్నారు. వాయిదా చెల్లింపులు జరిగిన కొద్దిరో జులు మాత్రం మూడు రోజులు పనిచేస్తే నాలుగు రోజులు మానేస్తున్నారు. తర్వాత మొత్తానికే మానేస్తున్నారు. దీంతో పనులు జరగక ఎక్కడి చీకట్లు అక్కడే ఉన్నాయి

డేంజర్ ప్రాంతాల్లోనూ అంతే..

కొత్తగా ఏర్పాటైన కాలనీలు, కమ్యూనిటీల్లో రాత్రివేళ ప్రమాదాలు, చోరీలకు ఆస్కారాలు న్నట్లు పోలీసులు, జీహెచ్‌ఎంసీ అధికారులు గుర్తించారు. ఈమేరకు ఆయా ప్రాంతాల్లో కొత్తగా స్ట్రీట్‌లైట్స్ వేసేందుకు దాదాపు రూ.3 కోట్ల మేర ఉపకరణాలు, బల్బుల కొనుగోలు టెండర్లు పూర్తిచేశారు. సామాగ్రి వస్తున్నా పనులు చేసే వారు లేకపోవడంతో కొత్త ప్రాంతా ల్లోనూ లైట్లు వేయడం లేదు. కొన్ని ప్రాంతాల్లో పోల్స్ పాతి ఎన్నో రోజులవుతున్నప్పటికీ, బల్బ్స్ వేసే పరిస్థితి లేక పోల్స్ అలంకారప్రా యంగా మారాయి.

ఇదీ ఒప్పందం

- గ్రేటర్ నగరంలో ఎల్‌ఈడీ స్ట్రీట్‌లైట్స్ ఏర్పాటు, నిర్వహణ పనులకు ఈఈఎస్‌ఎల్ 2018లో జీహెచ్‌ఎంసీతో ఒప్పందం కుదు ర్చుకుంది. ఆమేరకు..2018 మే నుంచి 2025 ఏప్రిల్ వరకు నగరంలో వెలుగుల నిర్వహణ ఈఈఎస్‌ఎల్‌దే. రహదారులతోపాటు లింక్ రోడ్లు, ఫ్లైఓవర్లు, పార్కులు, చెరువులు, శ్మశా నవాటికలు, తదితర ప్రాంతాల్లోనూ లైట్ల ఏర్పాటు, నిర్వహణ ఈఈఎస్‌ఎల్‌దే. ఎల్‌ఈడీ లైట్ల వల్ల జీహెచ్‌ఎంసీకి ఏడేళ్లలో దాదాపు రూ.673 కోట్లు ఆదా అవుతుందని అప్పట్లో పేర్కొన్నారు. దాంతో మిగిలే నిధులే ఈఈఎస్ ఎల్‌కు చెల్లిస్తామని జీహెచ్‌ఎంసీ రూ.563.58 కోట్లకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇప్పటికే మెజార్టీ చెల్లింపులు జరిగినట్లు సమాచారం. అయినా తమకు జీహెచ్‌ఎంసీ భారీ మొత్తం బకాయిలున్నట్లు ఈఈఎస్‌ఎల్ చెబుతోంది.
- ఒప్పందం మేరకు వెలగాల్సిన వీధిదీపాలు 5,40,494. కానీ ఈ మేర వెలగడం లేదు. ఈ లైట్లలో 98 శాతం వెలిగితేనే చెల్లింపులు చేయా లి. కానీ, ఈ నిబంధన గురించి గతంలోని అధి కారులు పట్టించుకోకుండా 80 శాతం వెలగని రోజుల్లో కూడా చెల్లింపులు చేశారనే ఆరోపణలు న్నాయి. అంతేకాదు..జీహెచ్‌ఎంసీలోని ఓ అధికారి ఈఈఎస్‌ఎల్‌తో కుమ్మక్కై లైట్లు వెలగ కపోయినా చెల్లింపులు జరిపారని, వెలగని కాలా నికి విధించాల్సిన పెనాల్టీలు మొక్కుబడిగా మాత్రమే విధించారనే ఆరోపణలూ ఉన్నాయి. అలా జీహెచ్‌ఎంసీకి నష్టం కలిగించిన వారున్నా, పట్టింపులేని జీహెచ్‌ఎంసీలో ఆ విషయాలు వెలుగుచూడలేదనే ఆరోపణలున్నాయి.
- స్ట్రీట్‌లైట్స్ ఆటోమేటిక్‌గానే వెలిగేందుకు, ఆరి పోయేందుకు 30,239 ఎస్‌ఎంఎస్‌లు (స్విచిం గ్ పాయింట్లు) ఉండాల్సి ఉండగా లేవు.
- 2017లో ఏడాదికి జీహెచ్‌ఎంసీకి విద్యుత్ బిల్లుల ఖర్చు రూ.137 కోట్లు. ఎల్‌ఈడీల వల్ల 2019 నాటికి అది రూ. 94 కోట్లకు తగ్గాలి. కానీ 2022–23లో సైతం రూ.106 కోట్లకు పైగా చెల్లించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



పతంగులపై ముద్రించిన కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను ప్రదర్శిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

షాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫల మైందని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేం దర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని అం బేడ్కర్ చౌరస్తాలో ఈ నెల 17న రైతు ధర్నా నిర్వహించనున్నారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్న సభా స్థలాన్ని సోమవారం బీఆర్‌ఎస్ యువ నేతలు పట్నం అవి నాశ్‌రెడ్డి, పట్లోళ్ల కార్తీక్‌రెడ్డితో కలిసి పరిశీలిం చారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడు తూ.. కాంగ్రెస్ ప్రభుత్వ హామీలను పతంగులపై ముద్రించి ప్రజలకు పంపిణీ చేసినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతు ధర్నాను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నక్క శ్రీనివాస్‌గౌడ్, జడల రాజేందర్‌గౌడ్, కుమ్మరి దర్శన్, అంబారెడ్డి, ముఖ్రంఖాన్, సత్య, రాంచందర్, కమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పొలంలోనే పోయిన ప్రాణం

విద్యుత్ షాక్‌తో రైతు మృతి




పోలమోని సత్తయ్య (ఫైల్)

మంచాల: వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరుట్ల గ్రామానికి చెందిన పోలమోని సత్తయ్య (70) తన వ్యవసాయ పొలం వద్ద కూరగాయాల తోటలకు నీళ్లు పెట్టడానికి సోమవారం ఉదయం వెళ్లాడు. ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు కాళ్లు తగ లడంతో షాక్‌వచ్చి అక్కడికక్కడే మృతి చెందాడు. చుట్టు పక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఇబ్రహీంపట్నం ప్రభుత్వ వైద్యశా లకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.



పొలంలో రైతు మృతదేహం

తగ్గిన విద్యుత్ వినియోగం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: సంక్రాంతి పండగకు నగర వాసులు తమ ఇళ్లకు తాళాలు వేసి...పల్లెటూర్లకు తరలి వెళ్లారు. అకస్మాత్తుగా గృహాలు, కార్యాల యాల్లో విద్యుత్ ఉపకరణాల వినియోగం పడిపో యింది. పారిశ్రామిక వాడల్లోని పలు పరిశ్రమ లతో పాటు, వ్యాపార, వాణిజ్య సంస్థలు ఉద్యోగు లకు సెలవు ప్రకటించి, కార్యాలయాలకు తాళాలు వేశాయి. ఉత్పత్తులు, రోజువారీ కార్యకలాపాలు నిలిపివేయడంతో రోజు వారి విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గింది. జనవరి 7న అత్యధికంగా 3271 మెగావాట్ల (60.07 మిలియన్ యూనిట్లు) విద్యుత్ డిమాండ్ నమోదు కాగా, తాజాగా 13న ఏకంగా 2500 మెగావాట్లకు (51.34 మిలియన్ యూనిట్లు) పడిపోయింది. సాధారణ రోజులతో పోలిస్తే పండుగ వేళ 700 మెగావాట్ల విద్యుత్ వాడకం తగ్గడం గమనార్హం. మంగళవారం గృహ, వాణిజ్య, పారిశ్రామిక విద్యుత్ వినియోగం మరిం త తగ్గే అవకాశం లేకపోలేదు. ఇదిలా ఉండగా సం క్రాంతి నేపథ్యంలో చిన్నారులు తమ ఇళ్లపై ఎగ రేసే పతంగ్‌లు విద్యుత్ తీగల పాలిట శాపంగా మారుతున్నాయి. పతంగ్‌లకు ఉన్న మాంజా వైర్లకు చుట్టుకోవడం, వైర్ల మధ్య చిక్కుకున్న పతం గ్‌లను తీసే క్రమంలో దారాన్ని గట్టిగా లాగడం వల్ల వైర్లు మెలికపడి షార్ట్‌సర్క్యూట్‌లు తలెత్తుతు న్నాయి. నిజానికి విద్యుత్ సంస్థలు డిమాండ్‌కు మించి సరఫరా చేస్తున్నప్పటికీ..పతంగ్‌ల కారణం గా సోమవారం పలు ప్రాంతాల్లో అంతరాయాలు తప్పలేదు. పండగ పూట తరచూ విద్యుత్ అంత రాయాలు తలెత్తడంతో వినియోగదారులు కొంత అసహనానికి గురయ్యారు.

గ్రేటర్‌లో వినియోగం ఇలా..

తేదీ	మెగావాట్లు	మిలియన్ యూనిట్లు
06	3,146	58.80
07	3,271	60.07
08	3,242	60.01
09	3250	59.06
10	3261	60.49
11	2863	56.95
12	2653	52.60

నిఘా నేత్రం.. అంతంత మాత్రం!

- అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు
- గ్రామాల్లో కొరవడిన నిర్వహణ
- మరమ్మతులకు నోచుకోని వైనం
- పెరుగుతున్న నేర ఘటనలు

మొయినాబాద్: నేరాల నియంత్రణకోసం గ్రామాల్లో ఏర్పాటు చేసిన నిఘా నేత్రాలు అలం కారప్రాయంగా మిగిలాయి. గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమరాలు ప్రస్తుతం చాలా గ్రామాల్లో పనిచేయడం లేదు. వాటి మరమ్మతులు, నిర్వహ ణను ఎవరూ పట్టించుకోవడంలేదు. పంచాయ తీల్లో ఆరేళ్ల క్రితం అప్పటి సర్పంచ్‌లు, దాతల సహాయంతో సీసీ కెమరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్రామంలో సుమారు 12 నుంచి 32 కెమ రాలు బిగించారు. సీసీ కెమరాలకు సంబంధించిన హార్డ్‌డిస్క్, స్క్రీన్‌ను పంచాయతీల్లో పెట్టారు. సర్పంచ్‌లు పదవిలో ఉన్నంతం కాలం నిర్వహణను స్వయంగా నిర్వహించారు. వారి పదవీకాలం గత సంవత్సరం ఫిబ్రవరి 1తో ముగియడంతో అప్పటి నుంచి ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. సీసీ కెమెరాల నిర్వహణకు పంచాయతీల నుంచి నిధులు ఇవ్వలేమని చేతులెత్తేశారు. నిర్వహణ గాలి కొదిలేశారు. చాలా గ్రామాల్లో సీసీ కెమెరాలు సరిగా పనిచేయడం లేదు. కొంత మంది సొంతంగా ఇళ్లు, షాపులు, ఫాంహౌస్‌లలో ఏర్పాటు చేసినవి మాత్రం అక్కడక్కడ పనిచేస్తున్నాయి.



సురంగల్ పంచాయతీలో పనిచేయని సీసీ కెమెరాల స్క్రీన్

చోరీలు చేసి దొరక్కుండా..

గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో నేరాలు పెరుగుతున్నాయి. చోరీలు చేసి దొరకకుం డా తప్పించుకుంటున్నారు. మరోవైపు చిన్నచిన్న గొడవలు పెరుగుతున్నాయి. ఇళ్లలోకి వచ్చి పుస్తెల తాళ్లు, బంగారు గొలుసులు లాక్కెళ్తున్నారు. వ్యవ సాయ బోర్ల కేబుల్స్ కట్ చేసుకుపోవడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసం చేసి రాగితీగలు దొంగలిం చడం వంటివి చాలా జరుగుతున్నాయి. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఉంటే ఇలాంటి చోరీలు, నేరాలను అరికట్టవచ్చని పలువురు అభిప్రాయపడుతు న్నారు.



పనిచేయని సీసీ కెమెరా

బాగుచేయించాలి



గ్రామంలో చాలా రోజులుగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పం చాయతీ అధికారులను అడిగితే తమకేమీ సంబం ధం లేదన్నట్లుగా సమా ధానం చెబుతున్నారు. ఇప్పటికైనా స్పందించి వెం టనే సీసీ కెమరాలు బాగు చేయించాలి.

– లోకేష్, సురంగల్, మొయినాబాద్ మండలం

చర్యలు తీసుకుంటాం



మొదటి ప్రాధాన్యతగా హైద రాబాద్–బీజాపూర్ జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం. గ్రామాల్లో నిర్వహణ బాధ్యత గతంలో సర్పంచ్‌లు చూసే వారు. ప్రస్తుతం సరిగా జరగడం లేదు. దాతల సహకారంతో పనిచేసేలా చర్యలు తీసుకుంటాం.

– పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్, మొయినాబాద్

ప్రమాదవశాత్తు మంటల్లో పడి వ్యక్తి మృతి

మొయినాబాద్: వ్యర్థాలను కాలుస్తున్న వ్యక్తి ప్రమాదవశాత్తు మంటల్లో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని చిలుకూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బ్యాగరి మల్లేశ్(60) స్థానిక ఎస్ లిక్కర్ మార్ట్ వైన్స్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం ఆయన రాత్రి 9.30గంటల ప్రాంతంలో వ్యర్థాలను కాలుస్తూ మంటల్లో పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రుడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే మల్లేశ్ చనిపోయాడని.. వైన్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఫిలింనగర్‌లో భారీ చోరీ

ఫిలింనగర్: వృద్ధ దంపతుల ఇంట్లో భారీగా నగదు, నగలు చోరీకి గురైన సంఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్-92లో నివసించే అరుణాదేవి, లక్ష్మయ్య దంపతులు ఈ నెల 10న ఉదయం వైకుంఠ ద్వార దర్శనం చేసుకునేందుకు సమీపంలోని గుడికి వెళ్లి మధ్యాహ్నం ఇంటికి వచ్చారు. ఆ తర్వాత కొద్దిసేపటికి అరుణాదేవి జిమ్‌కు వెళ్లి సాయంత్రం తిరిగి వచ్చింది. 11న ఉదయం అరుణాదేవి నిద్ర లేచి బయటికి వచ్చి చూడగా బాత్‌రూమ్ తలుపులు పగులగొట్టి ఉన్నాయి. ఆ పక్కనే జ్యువెలరీ బాక్స్‌లు పడి ఉండటంతో ఆందోళనకు గురైన ఆమె అల్మరా తెరిచి చూడగా అందులో ఉన్న రూ.1.50 లక్షల నగదు, బంగారు గాజులు, నెక్లెస్‌లు తదితర ఆభరణాలన్నీ చోరీకి గురైనట్లు గుర్తించింది. తాము ఇంట్లో లేని సమయంలో లేదా నిద్రిస్తున్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు కిటికీలో నుంచి లోపలికి ప్రవేశించి చోరీకి పాల్పడి ఉండవచ్చునని బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఫిలింనగర్ క్రైమ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీమ్‌తో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెరాయ్ గ్రాండేలో పోలీసుల తనిఖీ

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని సెరాయ్ గ్రాండే హోటల్‌లో మాదాపూర్ ఎస్‌ఓటీ, రాయదుర్గం లా అండ్ ఆర్డర్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. డ్రగ్స్, అసాంఘిక కార్యకలాపాలపై రొటీన్‌గా తనిఖీలు నిర్వహించినట్లు తెలుస్తోంది. ఇది ఇలా ఉండగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బంధువుకు చెందిన హోటల్‌లో పోలీసులు ఎలాంటి సెర్చ్ నోటీసు లేకుండా తనిఖీలు చేశారని సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయమై రాయదుర్గం ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకన్న మాట్లాడుతూ రొటీన్ చెకప్‌లో భాగంగానే తనిఖీలు నిర్వహించామని ఎలాంటి డ్రగ్స్ లభించలేదన్నారు. పండుగ సమయంలో హోటల్స్‌లో పేకాట ఆడే అవకాశం ఉందన్నారు. ఉద్దేశ పూర్వకంగా తనిఖీలు చేపట్టలేదని అన్నారు. సెర్చ్ వారెంట్ లేకుండా ఎంట్రీ, ఎగ్జిట్ వే నుంచి పెద్ద సంఖ్యలో పోలీసులు లోపలికి వచ్చి తనిఖీలు చేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ

వ్యక్తి దుర్మరణం



బాలమైసయ్య మృతదేహం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధి రాయికల్ సమీపంలోని బైపాస్ రహదారిలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండలం, కల్లెపల్లి గ్రామానికి చెందిన బాలమైసయ్య(45) రాయికల్ శివారులోని బాబాదాబా (ఎన్‌హెచ్-44) సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో హైద్రాబాద్ నుంచి జడ్చర్లవైపు ప్రయాణిస్తున్న గుర్తు తెలియని వాహనం బాలమైసయ్యను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన బాలమైసయ్య అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన విషయం కల్లెపల్లి గ్రామం సోషల్ మీడియాలో రావడంతో గుర్తించిన మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. మృతుడి బంధువు లాలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ బలరాం తెలిపారు.

సంక్రాంతి వెనుక సైన్స్

- పండుగలో ఔషధ నిధి మిళితం
- మూడు రోజులపాటు సందడి

సంక్రాంతి పండుగను తెలుగు ప్రజలు విశిష్టంగా జరుపుకుంటారు. భోగితో మొదలైన ఈ పండుగ ముక్కనుమతో ముగుస్తుంది. భోగి సందర్భంగా చలితీవ్రతను తట్టుకునేందుకు తెల్లవారు జామునే లేచి భోగి మంటలు వేస్తారు. సంక్రాంతి రోజున పిండివంటలు చేసుకోవడం, కూరగాయలు వాయినాలు ఇస్తుంటారు. కనుమ రోజున పశువులను పూజిస్తారు. పండుగ వెనుక దాగి ఉన్న సైన్స్ పరమార్థంపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

షాబాద్: మన దేశంలో ప్రత్యేకతలకు పెట్టింది పేరు తెలుగు పండుగలు. ప్రకృతిలో ఉండే అనేక సంస్కృతులు, ఔషధాల గొప్పతనాన్ని చాటుతుంటాయి. ఒక్కో పండుగకు ఒక్కో శాస్త్రీయ కోణం ముడిపడి ఉంటుంది. అందులో అతి ప్రత్యేకమైనది సంక్రాంతి పండుగ. సూర్యుడు మకరరాశిలో మారే కాలంలో బంతి, చామంతి పూలు, రేగుపండ్లు, మిరపపళ్లు పుష్కలంగా దొరుకుతాయి. ముంగిళ్లలో రంగులు, రంగవల్లులు వేసి వాటిని ఆవు పేడతో గొబ్బెమ్మలు, గరికపోచలు, పిండి కొమ్ములు, తంగేడు కొమ్ములు, వాటికి పసుపు అంటించి పువ్వులతో అలంకరిస్తారు. కొన్ని ప్రాంతాల్లో ముగ్గుల్లో సజ్జలు, జొన్నలు, బియ్యం పిండిని వాడుతారు. సంక్రాంతి ముందు రోజు భోగి నాడు మూడేళ్ల లోపు పిల్లలకు గ్రహణ పీడలు, శని తొలగి సకల ఐశ్వర్యాలతో ఉండాలని కోరుతూ రేగిపండ్లు పోస్తారు. గొబ్బెమ్మల చుట్టూ ధాన్యాలు పోసి పశు పక్ష్యాదులకు ఆహారంగా అందిస్తారు. మరుసటి రోజు సంక్రాంతి నాడు కొత్త బియ్యం, బెల్లం, నువ్వులతో పులగం వండుకుంటారు. ఇలా సంక్రాంతి పండుగ సమయంలో చేసే పనులన్నింటి వెనుక శాస్త్రీయ కోణం దాగి ఉంది. పూర్వ కాలంలో మన పెద్దలు రాబోయే వైరస్‌లు, వ్యాధులను ముందుగా గ్రహించి వాటికి అనుగుణంగా ముందస్తుగా జాగ్రత్తలు పాటించేవారు. అలా మన పెద్దలు ముందస్తుగా పాటించే జాగ్రత్తలను పండుగలు, పర్వదినాన్ని బట్టి ప్రకృతిలోని ఔషధాలు, పదార్థాలను వినియోగించేవారు. అలాగే సంక్రాంతి పండుగలో సైతం అనేక ప్రత్యేకమైన ఔషధాలు, సహజసిద్ధపదార్థాలను వినియోగించేవారు. ప్రకృతిలో లభించే వరి, శనగలు, మినుములు, నువ్వులు, సజ్జలు, పెసర్లు, బొబ్బర్లు, ఉలవలు వంటి రకరకాల ఆహార పదార్థాల్లో అనేక ఔషధ గుణాలు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి.

వంధ్యత్వం నివారణ

సంక్రాంతి పండుగకు నువ్వులు, బెల్లం, రేగుపండ్లు, గరిక తదితరాలు ఔషధాలతో కూడినవి. నల్లచెరకు, నువ్వులు, బెల్లంతో కూడిన ఆహార పదార్థాలు వంధ్యత్వం రాకుండా చేస్తుంది.

డాక్టర్ విజయలక్ష్మి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, షాబాద్



గొబ్బెమ్మలు
- ఆవుపేడతో తయారు చేయడంతో క్రిమిసంహారకంగా పనిచేస్తుంది.
- ప్రకృతి కాలుష్య నివారిణి.
- ఉష్ణ ఉత్పత్తి ఉపయోగాలు అధికం.

పొంగలి
- సంక్రాంతి నాడు చేసే పొంగలికి బియ్యం, నువ్వులు, బెల్లం ఉపయోగిస్తారు. దీంతో పాటు పండుగ రోజు పిండితో అరిసెలు చేస్తారు. వీటిలోనూ పోషక విలువలు అధికంగా ఉంటాయి.

రేగు పండ్లు
- వీటిలో ఔషధగుణాలు అధికం
- వాతం, మధుమేహం, మూల వ్యాధి నివారిణి
- రక్తశుద్ధి, ఉత్పత్తిలో ఉపయోగపడుతుంది.
- శరీరానికి అవసరమైన వేడి పుట్టించడంతో పాటు చలువ చేస్తుంది.
- విటమిన్-సి పుష్కలంగా లభిస్తుంది.

నువ్వులు
- శరీరంలో ఉష్ణ ఉత్పత్తిని పెంచుతాయి.
- ఔషధ గుణం ఉంటుంది.
- మూత్ర వ్యాధులను తొలగిస్తుంది
- ఎముకల్లో మజ్జ ఉత్పత్తిలో ప్రధాన పాత్ర వహిస్తుంది.

బియ్యం
- కడిగిన బియ్యం నీటిని పంచదారతో సేవిస్తే మూత్ర విసర్జన సాఫీగా ఉంటుంది.
- దప్పిక తగ్గుతుంది. వేసవిలో వడదెబ్బ నుంచి రక్షిస్తుంది.
- త్రిదోషహారిణిగా పనిచేస్తుంది.
- శరీరానికి కార్బోహైడ్రేట్లు అధికంగా అందుతాయి.

బెల్లం
- రక్తం వృద్ధి అయ్యేలా పనిచేస్తుంది.
- శరీరంలో ఖనిజ లవణాలను పెంచుతుంది.
- శరీరాన్ని కాంతిమయంగా చేస్తుంది.
- కోప, తాపాలను తాగిస్తుంది.
- సర్వ దోష లక్షణాలను నిరాలిస్తుంది.

పిండి కొమ్ములు
- జీర్ణ వ్యాధులు, త్రిదోశ, ఉదరవ్యాధుల నివారిణి.
- పైత్యరసం ఉత్పత్తిలో ప్రాత వహిస్తుంది.
- రక్తం వృద్ధి చేస్తుంది.

గరక
- పచ్చి గరకను మెత్తగా నూరి గాయాలపై పూస్తే మానిపోతాయి.
- ప్రకృతి సమతుల్యతను కాపాడుతుంది.
- దగ్గు, ఆయసం, మలబద్ధకాన్ని నివారిస్తుంది.

కబడ్డీ విజేత హస్నాబాద్ జట్టు



ట్రోఫీ అందజేస్తున్న కమల్‌నాబా చారి

దుద్యాల్: మండలంలోని హస్నాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో హస్నాబాద్ జట్టు విజేతగా నిలిచింది. రెండో స్థానంలో కొడంగల్, మూడో స్థానంలో పెద్దనంది గామా జట్లు నిలిచారు. ఎస్వీఆర్‌ఈ ఇండస్ట్రీస్ అధినేత కమల్‌నాబా చారి విజేతలకు బహుమతులు అందజేశారు. విజేత జట్టుకు రూ.30 వేలు, రెండో స్థానంలో నిలిచిన జట్టుకు రూ.20 వేలు, మూడో విజేతకు రూ.5 వేలు, కప్పులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు భీములు, కుదురుమల్ల మాజీ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

కుల్కచర్ల: క్రీడలతో మానసిక వికాసం పెంపొందుతుందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని బండవెల్కిచర్లలో నిర్వహించిన లక్ష్మారెడ్డి స్మారక వాలీబాల్ టోర్నీని సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. యువత చదువుతో పాటుగా క్రీడల్లోనూ రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులుముదిరాజ్, పాంబండ ఆలయ చైర్మన్ కోట్ల మైపాల్‌రెడ్డి, బ్లాక్ బి అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, బాలనగర్ ఎంఈఓ హరిశ్చందర్, నాయకులు గోవర్ధన్ రెడ్డి, ఆనందం తదితరులు పాల్గొన్నారు.

మాదిగలంతా డప్పుతో రావాలి



రథయాత్ర ప్రారంభిస్తున్న ఎస్‌వై అశోక్ మాదిగ తదితరులు

- ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎస్‌వై అశోక్
- రేగడి మైలారంలో 'వేల గొంతులు–లక్ష డప్పులు' రథయాత్ర ప్రారంభం

బొంరాస్‌పేట: మాదిగ ఉపకులాల సామాజిక న్యాయం కోసం మందకృష్ణ మాదిగ చేపట్టిన పోరాటానికి డప్పులతో రావాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కళామండలి అధ్యక్షుడు ఎస్‌వై అశోక్ పిలుపునిచ్చారు. సోమవారం మండల పరిధిలోని రేగడిమైలారంలో 'వేల గొంతులు–లక్ష డప్పులు'రథయాత్ర ప్రారంభించారు. ముందుగా మాజీ ఎంపీ మందా జగన్నాథం మాదిగకు, మాదిగ అమరులకు నివాళి అర్పించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి రథయాత్ర ప్రారంభించారు. ఈ యాత్ర మండల పరిధిలోని చౌదర్‌పల్లి, నాందార్‌పూర్, తుంకిమెట్ల గ్రామాల మీదుగా సాగింది. ఫిబ్రవరి7న హైదరాబాద్‌లో నిర్వహించే వేల గొంతులు–లక్ష డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

త్వరలో కొడంగల్‌కు మందకృష్ణ

జిల్లా స్థాయి రథయాత్ర నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తుంకిమెట్లలో విలేకరుల సమావేశంలో చెప్పారు. కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో జిల్లా స్థాయి బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారని వివరించారు. మండలాల వారీగా పెద్ద ఎత్తున వచ్చి విజయవంతం చేయాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు రాంచందర్, స్వామి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లికార్జున మాదిగ, ప్రధాన కార్యదర్శి సుభాశ్, ఉపాధ్యక్షుడు మల్కప్ప, మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్, అరుణోదయ అనిత, రమేశ్‌బాబు, ఎరన్‌పల్లి శ్రీనివాస్, దాసరి చంద్రప్ప, గ్రామాల అధ్యక్షుడు యేసు, బందెప్ప, వెంకటయ్య, తదితరులున్నారు.

కమనీయం.. కల్యాణం

రాజేంద్రనగర్: హైదర్‌గూడ చైతన్య విలాస్ కాలనీలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయం ఆవరణలో సోమవారం గోదాదేవి కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. కల్యాణం సందర్భంగా దేవాలయ ఆవరణాన్ని చూడముచ్చటగా అలంకరించారు. గోదాదేవి కల్యాణ మహోత్సవానికి స్థానిక ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు హాజరై కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. గత నెల రోజులుగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు కల్యాణ మహోత్సవంతో ముగిశాయి. కల్యాణ మహోత్సవం అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ప్రవచకులు టి.కె.అభిరామ్‌ను దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా దేవాలయ కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.



గోదాదేవి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పూజారులు



గోదాదేవి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

సంప్రదాయాలను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాగయ్య

కుల్కచర్ల: జాతీయ భావాలను పెంపొందించుకోవడంతో పాటుగా సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని ఆర్ఎస్ఎస్ అఖిల భారత కార్యకారిణి సభ్యుడు భాగయ్య అన్నారు. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని వివేకానంద కళాశాలలో కుల్కచర్ల శాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటుగా వ్యవసాయంలోనూ అలనాటి పద్ధతులను పాటించాలన్నారు. సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడి, ఆరోగ్యమైన పంట లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సంఘ నాయకులు ప్రహ్లాదరావు, ఎల్లయ్య, ఆంజనేయులు, రవి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

'పెండింగ్ వేతనాలు చెల్లించండి'

కొడంగల్ రూరల్: అర్చకుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని దూప దీప నైవేద్య సంఘం (డీడీఎన్ఎస్) జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సంక్రాంతి పండగకు అందరి ఇళ్లలో ఆనందాలు వెల్లివెరిస్తున్న క్రమంలో అర్చకుల ఇంట మాత్రం ఆనందాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలలుగా వేతనాలు అందక దిక్కుతోచని పరిస్థితి నెలకొందని ఆందోళన వెల్లిబుచ్చారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యల పరిష్కరించి పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు.

యువతిని ఢీ కొట్టిన కారు

మణికొండ హుడా కాలనీలో ఘటన



ఘటనా స్థలిలో పడిపోయిన యువతి

మణికొండ: రోడ్డు ఎత్తుగా ఉండటంతో అదుపుతప్పిన కారు స్కూటీపై వెళ్తున్న ఓ యువతిని ఢీ కొట్టింది. దాంతో ఆమెకు తీవ్ర గాయాలు కావటంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటన మణికొండ మున్సిపాలిటీ, హుడా కాలనీలో ఆదివారంరాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హుడా కాలనీలోని లైట్ అండ్ లైట్ వద్ద భాగ్యలక్ష్మి కాలనీ వైపు నుంచి వచ్చిన మారుతి బ్రీజా కారు వచ్చింది. ఓపెన్ జిమ్ వద్ద ఓ మహిళ కారును నడుపుతూ, స్కూటీపై వస్తున్న ఎంప్లాయీస్ కాలనీకి చెందిన గాయత్రిని ఢీకొట్టింది. కారు, ఓపెన్ జిమ్ గోడ మధ్యల గాయత్రి చిక్కుకోవటంతో తీవ్రగాయాలై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గాయాలపాలైన యువతిని వెంటనే మణికొండలోని ఆవాస ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు.

కేరళలో చోరీ... సికింద్రాబాద్‌లో షెల్టర్!

- తిరునల్వేలిలో జ్యువెలరీ దుకాణాన్ని దోచేసిన రామకృష్ణన్
- గత ఏడాది ఆగస్టులో చోటు చేసుకున్న భారీ దొంగతనం
- సొత్తు తల్లికి ఇచ్చి నగరానికి వచ్చి ప్రైవేట్ ఉద్యోగిగా మకాం
- సాంకేతిక ఆధారాలతో నిందితుడిని పట్టుకున్న అక్కడి కాప్స్
- అతడి ఇంటి నుంచి సొత్తు సీజ్, అవమానంతో తల్లి ఆత్మహత్య



సాక్షి, సిటీబ్యూరో: కేరళలోని తిరునల్వేలి జిల్లా మూలక్‌రాయ్‌పట్టిలో ఉన్న జ్యువెలరీ దుకాణంలో రెండు కేజీలకు పైగా బంగారు ఆభరణాలు చోరీ చేసి, నాలుగున్నర నెలలుగా పరారీలో ఉన్న రామకృష్ణన్‌ను అక్కడి పోలీసులు శనివారం సికింద్రాబాద్‌లో అరెస్టు చేశారు. విచారణలో భాగంగా ఆ సొత్తును తాను తల్లి మీనాక్షి వద్దే ఉంచానని చెప్పాడు. దీంతో ప్రత్యేక బృందం తిరునల్వేలి సమీపంలోని రెట్టార్కులం గ్రామంలోని వారి ఇంటిపై దాడి చేసి సొత్తు స్వాధీనం చేసుకున్నారు. ఈ అవమానాన్ని తట్టుకోలేక మీనాక్షి ఆదివారం ఉదయం ఆత్మహత్య చేసుకుంది.

అక్కడ చోరీ చేసి సిటీకి వచ్చి...

మూలక్‌రాయ్‌పట్టికి చెందిన వి.రెహ్మాన్ అక్కడే కొన్నేళ్లుగా జ్యువెలరీ దుకాణం నిర్వహిస్తున్నారు. ఆ సమీపంలోని రెట్టార్కులం గ్రామానికి చెందిన రామకృష్ణన్ ప్రైవేట్ ఉద్యోగి. జల్సాలకు అలవాటుపడిన ఇతగాడు కొన్నేళ్లుగా తిరునల్వేలి చుట్టుపక్కల ప్రాంతాల్లో చిన్న చిన్న దొంగతనాలు చేస్తున్నాడు. ఇప్పటి వరకు పట్టుబడకపోవడంతో పోలీసు రికార్డుల్లోకి ఎక్కలేదు. గత ఏడాది ఆగస్టులో ఇతడి కన్ను రెహ్మాన్ నిర్వహిస్తున్న జ్యువెలరీ దుకాణంపై పడింది. ఆ నెల 22 రాత్రి షెల్టర్ పగులకొట్టి లోపలకు ప్రవేశించిన రామకృష్ణన్ 2.22 కేజీల బంగారం, రూ.3 లక్షల నగదు తస్కరించాడు. ఆ సొత్తును బయటకు తీయకుండా దాచి ఉంచి, కొన్నాళ్లు తన స్వస్థలానికి దూరంగా ఉంటే పోలీసులకు చిక్కనని భావించాడు.

స్నేహితుడిది అంటూ తల్లికి ఇచ్చి...

మర్నాడు దుకాణం తెరిచిన వెంటనే కనిపించిన సీన్‌తో తన దుకాణంలో జరిగిన చోరీ విషయం రెహ్మాన్ గుర్తించాడు. దీనిపై మూలక్‌రాయ్‌పట్టి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. దర్యాప్తు కోసం తిరునల్వేలి ఎస్పీ నేతృత్వంలో తొమ్మిది ప్రత్యేక బృందాలు ఏర్పడ్డాయి. గుర్తించిన జ్యువెలరీ దుకాణం నుంచి తస్కరించిన నగదు తన వద్ద ఉంచుకున్న రామకృష్ణన్ బంగారం మాత్రం నేర్పుగా ప్యాక్ చేశాడు. రెట్టార్కులంలోని తల్లికి దీన్ని ఇచ్చి ఇంట్లో ఉంచాలని సూచించాడు. దుబాయ్ వెళ్తున్న తన స్నేహితుడు కొన్ని విలువైన వస్తువులు ప్యాక్ చేసి, భద్రపరచాలని ఇచ్చాడంటూ ఆమెను నమ్మించాడు. నగదుతో గత ఏడాది ఆగస్టు 23న కేరళ నుంచి హైదరాబాద్ చేరుకున్నాడు. హోటళ్లలో బస, ఖరీదైన మద్యం, ఆహారం, జల్సాలతో మూడు నెలల్లోనే రూ.3 లక్షలు ఖర్చు చేసేశాడు.

నిర్మాణం వద్ద కాపలాదారుడిగా పని...

దీంతో సికింద్రాబాద్‌లోని ఓ నిర్మాణం వద్ద కాపలాదారుడిగా ప్రైవేట్ ఉద్యోగంలో చేరాడు. కనీసం ఏడాది పాటు ఇక్కడ తలదాచుకుని ఆపై స్వస్థలానికి వెళ్లాలని భావించాడు. ఆ తర్వాత తల్లి వద్ద ఉన్న సొత్తును విక్రయించి సొమ్ము చేసుకోవాలని అనుకున్నాడు. సికింద్రాబాద్‌లో కొత్త ఫోన్ నెంబర్ తీసుకున్న రామకృష్ణన్ దాన్ని వినియోగించి తల్లి మీనాక్షితో మాట్లాడటం మొదలెట్టాడు. మూలక్‌రాయ్‌పట్టి చోరీ కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసు బృందాలు సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా రామకృష్ణన్‌ను నిందితుడిగా గుర్తించాయి. అయితే అతడి ఆచూకీ కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో తల్లి ఫోన్‌పై నిఘా ఉంచాయి. ఆమెకు సికింద్రాబాద్‌లో ఉన్న నెంబర్ నుంచి ఫోన్లు వస్తున్నట్లు గుర్తించాయి. దీంతో శనివారం ఇక్కడకు వచ్చిన ఓ స్పెషల్ టీమ్ రామకృష్ణన్‌ను పట్టుకుంది. ప్రాథమిక విచారణలోనే అతగాడు విషయాలన్నీ బయటపెట్టాడు.

తీవ్ర అవమానంగా భావించిన మీనాక్షి...

నిందితుడిని తీసుకుని కేరళ బయలుదేరిన పోలీసులు జ్యువెలరీ దుకాణంలో చోరీ చేసిన సొత్తు అతడి తల్లి వద్ద ఉందనే విషయాన్ని అక్కడి టీమ్‌కు చెప్పారు. దీంతో ఓ బృందం ఆదివారం ఉదయం రెట్టార్కులం గ్రామంలోని రామకృష్ణన్ ఇంట్లో దాడి చేసి 2.22 కేజీల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిణామంతోనే తన కుమారుడు దొంగగా మారాడనే విషయం మీనాక్షికి తెలిసింది. దీనికి తోడు గ్రామంలో అందరూ చూస్తుండగా పోలీసులు తమ ఇంట్లో సోదాలు చేయడం, చోరీ బంగారం రికవరీ చేయడాన్ని తీవ్ర అవమానంగా భావించింది. దీంతో పోలీసులు వెళ్లి కొద్దిసేపటిలో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుస్టేషన్‌కు వచ్చి తిరిగి వెళ్లిన ఆమె భర్త ఈ విషయం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. 'సోమవారం రామకృష్ణన్‌ను రెట్టార్కులం తీసుకువెళ్లి మీనాక్షి అంత్యక్రియలు పూర్తి చేయించాం. ఆపై కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించాం. అతడు ఇలాంటి మరికొన్ని నేరాలు చేసినట్లు అనుమానం ఉంది. కస్టడీలోకి తీసుకుని ఆ కోణంలో విచారిస్తాం' అని తిరునల్వేలికి చెందిన ఓ ఉన్నతాధికారి 'సాక్షి'కి ఫోన్ ద్వారా తెలిపారు.